
# సాక్షి విశాఖపట్నం

బుధవారం | 25 | అక్టోబర్ | 2023




**జూ ఆదాయం రూ.8 లక్షలు**

ఇందిరాగాంధీ జూ పార్కుకి దసరా తాకిడి పెరిగింది. పర్యాటకులు తరలివచ్చారు. రూ.8లక్షల ఆదాయం సమకూరింది. 8లో



**సం'క్షేమ' హాస్టల్స్**

సంక్షేమ వసతి గృహాలు సకల వసతుల సమాహారంగా మారుతున్నాయి. జిల్లాలో 13 హాస్టల్స్ రూపురేఖలు మారుతున్నాయి. 8లో



**ట్రెక్కింగ్.. థ్రిల్లింగ్**

నగర పర్యాటక ప్రాంతాల్లో కంబాలకొండ ప్రత్యేకమైనది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ట్రెక్కింగ్ సదుపాయం కూడా ఉంది. 8లో

## న్యూస్‌రీల్

### స్వర్ణాభరణాలతో సిరులతల్లికి అలంకరణ



డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహించిన శరన్నవరాత్రుల మహోత్సవాలు మంగళవారం విజయదశమితో ముగిశాయి. చివరి రోజున కనకమహాలక్ష్మి స్వర్ణాభరణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. విజయదశమి సందర్భంగా అమ్మవారికి స్వర్ణకవచ అలంకరణ జరిపారు. అనంతరం శ్రీచక్ర నవార్చన, లక్ష్మీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

### అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సుబ్బారెడ్డికి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

### 28న ఉపరాష్ట్రపతి రాక

మహారాణిపేట: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ దంపతులు ఈ నెల 28న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. విమానాశ్రయంలో గౌరవ వందనం, పరిచయ కార్యక్రమం అనంతరం నేరుగా ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ)కి వెళ్తారు. అక్కడ ఏఎంసీ సెంటినరీ ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంట వరకు అక్కడే ఉంటారు. తర్వాత ఐఎన్ఎస్ డేగాకు బయలుదేరుతారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఐఎన్ఎస్ డేగాను సందర్శిస్తారు. మధ్యాహ్నం 3.55 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలుదేరుతారు.

### విమానాశ్రయంలో సోనూసూద్ సందడి



అభివాదం చేస్తున్న సోనూసూద్

గోపాలపట్నం: ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ విశాఖ విమానాశ్రయంలో మంగళవారం సందడి చేశారు. ఆయన్ని చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. కొందరు సెల్ ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీశారు. గాజువాకలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన అభిమానులకు అభివాదం చేస్తూ రోడ్డు మార్గంలో వెళ్లారు.

### నేడు ములగాడలో 'జగనన్నకు చెబుదాం'

మహారాణిపేట: ములగాడ మండలంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మల్కాపురంలోని శ్రీ మరిడిమాంబ కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. జిల్లా అధికారులు, జీవీఎంసీ, ఇతర అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. మండలంలో ప్రజలంతా హాజరై తమ సమస్యలు తెలపవచ్చన్నారు.

# దసరోత్సాహం



అమ్మా నీ దయ కోసం వచ్చాం.. మమ్మల్ని కరుణించవే..



దుర్గాలమ్మా.. కాపాడమ్మా

- ఈ ఏడాది రెండు రోజుల పండగ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- విరివిగా మాంసం విక్రయాలు
- నాటుకోడి మాంసం కిలో రూ.వెయ్యి

సాక్షి, విశాఖపట్నం: దసరా పండగను భక్తజనం ఉత్సాహంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు. ఈ ఏడాది దశమి తిథి రెండు రోజులు కొనసాగడంతో దసరా పండగను రెండు రోజులు నిర్వహించుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కూడా సోమ, మంగళవారాలు సెలవు దినాలుగా పరిగణిస్తున్నట్టు ప్రకటించింది. అంతకుముందు శని, ఆదివారాలు రావడంతో ఉద్యోగులకు కూడా నాలుగు రోజులు సెలవులు లభించినట్టయింది. సోమవారం కొంతమందే పండగ చేసుకోగా, అత్యధికులు మంగళవారం జరుపుకున్నారు. దసరా అంటేనే మాంసాహార ప్రియులకు ఎంతో ఇష్టం. విజయ దశమికి విధిగా మాంసాహారాన్ని తినాలన్న రివాజు అనాదిగా వస్తోంది. పైగా సోమవారం నియమాలతో మాంసాహారాన్ని భుజించని వారికి మంగళవారం బాగా కలిసొచ్చింది. దీంతో చికెన్, మటన్‌లను బాగా డిమాండ్ పెరిగింది. దసరాకు నాటుకోళ్లను తినడానికి చాలా మంది ఇష్టపడతారు. ఇలాంటి వారు నాటుకోళ్ల కోసం పొరుగు జిల్లాలకు కూడా వెళ్లి కొనుగోలు చేస్తారు. ఈసారి వీటి లభ్యత డిమాండ్‌కు సరిపడినంత లేకపోవడం, ధర కూడా ఎక్కువగా ఉండడంతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లి మరీ కొనుగోలు చేశారు. ప్రస్తుతం కిలో బ్రాయిలర్ చికెన్ రూ.240 ఉంటే నాటుకోడి మాంసం రికార్డు స్థాయిలో రూ.వెయ్యి పలికింది. ఈ దసరాకు లైవ్ నాటుకోడి కిలో రూ.800, డ్రెస్సడ్ నాటుకోడి చికెన్ రూ.వెయ్యికి పెంచారు. కాగా మటన్ ధర కొన్నాళ్ల నుంచి కిలో రూ.900 ఉండేది. దసరాకున్న డిమాండ్‌తో ఆ ధరను రూ.వెయ్యి చేశారు. అయినప్పటికీ నాటుకోడి, మటన్ అంటే ఇష్టపడే వారు ధరను లెక్క చేయకుండా తగ్గేదే లే! అంటూ కొనుగోలు చేశారు. ఇక మందుబాబులకు దసరా అంటే చెప్పలేనంత సరదా. ఈ పండుగకు మద్యం సేవించి ఆనందపు మత్తులో మునిగి తేలుతారు.

**కిటకిటలాడిన దుర్గాలమ్మ ఆలయం**

పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. దశమి రోజైన మంగళవారం అమ్మవారి ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకుని తరించారు.



అమ్మవారి దర్శన భాగ్యం కోసం..

### భక్తి ప్రపత్తులతో భక్త జనం

దసరా పండగను పలువురు భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. ఉదయాన్నే లేచి స్నానాలాచరించారు. విజయ దశమిని పురస్కరించుకుని దుర్గ ఆలయాలను, ప్రత్యేక ఏర్పాటు చేసిన మంటపాలను మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు దుర్గాదేవి ఆలయాలను, వీధుల్లోను, సమీప ప్రాంతాల్లోని మంటపాల్లో కొలువైన అమ్మవారిని దర్శించుకున్నారు. ఇలా ఈ రెండు రోజులూ ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తజనం వీటికి పోటెత్తుతూనే ఉన్నారు. మరికొందరు సాయంత్రం వేళ పార్కులు, సాగరతీరానికి వెళ్లి పిల్లాపాపలతో, బంధుమిత్రులతో సంతోషంగా గడిపి వచ్చారు. ఇంకొందరు సినిమాలకు వెళ్లారు. సాధారణంగా దసరా పండగకు ముసురు కోవడం ఆనవాయితీగా వస్తుంది. కానీ ఈసారి వరుణుడు ముఖం చాటేయడంతో అలాంటి బెడద కూడా తప్పింది.



పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

# ఘనంగా అప్పన్న జమ్మివేట



పూలతోటలోని శమీవృక్షం వద్ద శమీదళాలను కోస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

- రామాలంకారంలో దర్శనమిచ్చిన అప్పన్న
- శాస్త్రోక్తంగా శమీపూజ
- అశ్వవాహనంపై గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం



రామాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

సింహాచలం : విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జమ్మివేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కొండదిగువన పూలతోటలో రాత్రి ఈ ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామాలంకరణలో స్వామివారిని సింహగిరి నుంచి సాయంత్రం 5 గంటలకు మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచాకు చేరుకున్న స్వామికి దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఉద్యోగులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామిని మేళతాళాలు, నాదస్వర వాయిద్యాలతో పూలతోటలోకి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పూలతోటలో ఉన్న ప్రధాన మండపంలో వేంజేపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు, వేద పారాయణాలు, పంచసూక్త పారాయణాలను నిర్వహించారు. పూలతోటలోనే ఉన్న శమీ వృక్షం చెంతన విశేష పూజలు నిర్వహించారు. తదుపరి చెట్టుకున్న శమీ దళాలను కోసి మండపంలోని స్వామికి సమర్పించారు. ఉత్సవాన్ని కనులారా తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. అనంతరం స్వామిని స్థానిక పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి అక్కడ ఉన్న అశ్వవాహనంపై వేంజేపజేశారు. తదుపరి గ్రామ తిరువీధిని కనుల పండువగా నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు విశేషంగా మంగళహారతులు ఇచ్చారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈవేడుకను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ తదిరులు స్వామిని దర్శించుకున్నారు.

**విశేషంగా ఏర్పాట్లు**

జమ్మివేట ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణతో పూలతోటను తీర్చిదిద్దారు. స్వామి మండపాన్ని, శ్రీకృష్ణ కొలను, రాతి ఫౌంటైన్లకు రంగులు వేశారు. మెట్లమార్గంలో పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేశారు. ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ఇస్కాన్‌లో రావణ దహనం



ఇస్కాన్ ఆవరణలో రావణ దిష్టిబొమ్మ దహనం



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో గల సీతారామలక్ష్మణ, హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాధాకృష్ణులను, సుభద్ర, బలభద్ర జగన్నాథ స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 50 అడుగుల భారీ రావణ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఫైర్ క్రాకర్ షో, రామలీలపై ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# పోలీస్ కమిషనర్ ఆయుధ పూజ



నగర పోలీస్ కమిషనరేట్‌లోని ఆయుధాగారంలో పూజలు నిర్వహిస్తున్న సీపీ రవిశంకర్

అల్లిపురం: విజయదశమి సందర్భంగా పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ బ్యారెక్స్‌లోని బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. దసరా పర్వదినం సందర్భంగా నగర పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఆయుధాగారంలో తుపాకులు, ఆయుధాలు దుర్గామాత చిత్రపటం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నగర పోలీస్ మోటారు ట్రాన్స్‌పోర్టు వాహనాలకు, పోలీస్ జిమ్, పోలీస్ సెక్యూరిటీ వింగ్‌లో కమిషనర్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, క్రైం డీసీపీ గంధం నాగన్న, నగర ఏడీసీపీలు, ఏసీపీలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఐలు, పీఆర్ఓ, ఆర్ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాఘాతం!



- జిల్లాలో ఈ నెలలో 11 శాతం వర్షపాతం
- అక్టోబర్‌లో సరాసరి వర్షపాతం 191.6 మి.మీ.. కురిసింది 20.6 మి.మీ
- నెలాఖరు వరకు వర్షాలకు అవకాశం లేదు..

సాక్షి, విశాఖపట్నం : అక్టోబరు నెలలో భారీ వర్షాలు కురుస్తాయి. కొన్ని సార్లు కుండపోత వానలతో వరదలూ సంభవిస్తాయి. వాగులూ, వంకలు పొంగి ప్రవహిస్తాయి. కానీ ఈ ఏడాది ఈ నెలలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వేసవిని తలపించే ఎండలు కాస్తున్నాయి. పగలూ, రాత్రి ముచ్చమటలు పోస్తున్నాయి. సమృద్ధిగా వర్షాలు కురవాల్సిన రోజుల్లో చిరు జల్లుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఆహ్లాదకర వాతావరణం కోసం అర్రులు చాచాల్సిన పరిస్థితి దాపురించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం.. విశాఖ జిల్లాలో అక్టోబర్ నెల సగటు వర్షపాతం 239.9 మి.మీలు. అక్టోబర్ 24 వరకు 191.6 మి.మీలు కురవాల్సి ఉండగా కేవలం 11 శాతం అంటే.. 20.6 మి.మీలు మాత్రమే కురిసింది. అక్టోబరులో ఇంత తక్కువ వర్షపాతం నమోదు కావడం ఇదే ప్రథమమని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవానికి సంవత్సరం మొత్తమ్మీద అక్టోబరు నెలలోనే విశాఖ జిల్లాలో ఎక్కువ వర్షపాతం రికార్డవుతుంది. ఈ నెలలో సరాసరి తొమ్మిది రోజులు వర్షాలు కురుస్తాయి. కానీ గడచిన 24 రోజుల్లో రెండు మూడు రోజులు మాత్రమే తేలికపాటి జల్లులు కురిశాయి. మిగిలిన రోజులన్నీ పొడి వాతావరణమే నెలకొంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న 'హమూన్' తుపాను కూడా చిన్నపాటి చినుకునైనా కురిపించకుండానే పలాయనం చిత్తగిస్తూ మన పొలిమేరల నుంచి తరలి పోయింది. దీంతో తుపాను వస్తే వానలు కురుస్తాయన్న ఆశలనూ తుంచేసింది. ఇక ఈశాన్య రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించినా అవి కూడా నిర్వీర్యంగానే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులను బట్టి నెలాఖరు వరకు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలకు ఆస్కారం ఉండదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో రానున్న వారం రోజుల్లోనైనా వర్షాలు కురిసి కొంతవరకైనా ఉపశమనం లభిస్తుందన్న ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.

### ఈశాన్య గాలులతో కొంత ఊరట

ఇక అక్టోబర్ వర్షాల జాడలేకుండా పోగా, ఉష్ణోగ్రతలూ ఉగ్రరూపం దాల్చాయి. ఈ నెలలో విశాఖలో సగటున 32 డిగ్రీల గరిష్ఠ, 25 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావాలి. కానీ సాధారణంకంటే పగటి ఉష్ణోగ్రతలు 3–6 డిగ్రీలు అధికంగా రికార్డవుతూ వేసవి తాపాన్ని తలపిస్తున్నాయి. దీంతో జనం పగలూ, రాత్రి తేడా లేకుండా ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లను అదే పనిగా వినియోగిస్తున్నారు. అయితే మూడు, నాలుగు రోజుల నుంచి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. ఇవి చల్లదనాన్ని కలిగి ఉండడంతో ఉష్ణోగ్రతలు తగ్గి ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. అలాగే రాత్రి వేళ కూడా చల్లగాలులు కొనసాగుతుండడం ఊరటనిస్తున్నాయి.

• డోర్ డెలివరీ

# వేగంగా.. విస్తృతంగా..





ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ కార్యాలయం

- ప్రస్తుతం పరిమిత స్థాయిలోనే సరకు డెలివరీ
- కొత్తగా ఉత్తరాంధ్రలో మరిన్ని పట్టణాలకు విస్తరణ
- రోజుకు 400 వరకు పార్సిళ్ల పంపిణీ లక్ష్యం
- రేపటి నుంచి నెల రోజులు ఆర్టీసీ అధికారుల ప్రచారం

| పార్సిల్/కొరియర్ | ధర |
|---|---|
| ఒక కిలో | రూ.18 |
| ఆరు కిలోలు | రూ.30 |
| పది కిలోలు | రూ.36 |
| 25 కిలోలు | రూ.48 |
| 25-50 కిలోలు | రూ.59 |

సాక్షి, విశాఖపట్నం: ఇంటికే పార్సిళ్లు, కొరియర్‌లను పంపిణీ చేసే డోర్ డెలివరీ వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే ఆర్టీసీ డోర్ డెలివరీకి ప్రజల్లో ఆదరణ ఉంది. అయితే ఇప్పటివరకు అది పరిమిత స్థాయిలోనే పంపిణీ జరుగుతోంది. ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించిన సర్వేలో 66 శాతం మంది ఖాతాదారులు డోర్ డెలివరీకే ప్రాధాన్యమిస్తున్నట్టు వెల్లడైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని డోర్ డెలివరీ సదుపాయాన్ని మరింత విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని పట్టణాలకు ఈ సదుపాయాన్ని కల్పించనుంది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖపట్నం, విజయనగరంల్లో మాత్రమే డోర్ డెలివరీ సదుపాయం ఉంది. ఇప్పుడు పలాస, శ్రీకాకుళం, బొబ్బిలి, మద్దిలపాలెం(విశాఖపట్నం), అనకాపల్లి, నర్సీపట్నంలోనూ దీనిని అందుబాటులోకి తీసుకురానుంది. ఆయా పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేయనున్నారు. ఇందుకు కిలో బరువున్న పార్సిల్/కొరియర్ కవర్‌కు రూ.18, ఆరు కిలోల వరకు రూ.30, పది కిలోలకు రూ.36, 25 కిలోల వరకు రూ.48, 25–50 కిలోల వరకు రూ.59 చొప్పున వసూలు చేస్తారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయనగరం పార్సిల్ బుకింగ్ కేంద్రాల నుంచి రోజుకు సగటున 20 వరకు డోర్ డెలివరీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు జోన్–1 పరిధిలో కొత్తగా ఈ పట్టణాలకు ఈ సదుపాయం విస్తరించనుండడంతో ఆ సంఖ్య 400 వరకు పెంచాలని ఆర్టీసీ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. డోర్ డెలివరీ చేయడానికి గతంలో జోన్ల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇకపై రాష్ట్రం మొత్తం మీద సింగు సొల్యూషన్స్ అనే ఒక్క సంస్థకు మాత్రమే ఖరారు చేశారు. దీని వల్ల ఏదైనా సమస్య తలెత్తినా ప్రధాన కేంద్రం నుంచే సరిచేసే వీలుంటుందని భావిస్తున్నారు.

**విస్తృత ప్రచారం**

ఆర్టీసీ యాజమాన్యం డోర్ డెలివరీ సేవలను విస్తృతం చేస్తున్న విషయాన్ని జనంలోకి బాగా తీసుకురావాలని ఎండీ ద్వారకా తిరుమలరావు సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఈనెల 26 నుంచి వచ్చే నెల 25 వరకు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఆర్టీసీ పార్సిల్, కొరియర్, సరకు రవాణాలో భాగస్వాములయ్యే కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, ఆపరేటర్లతో సమావేశం కానున్నారు. అంతేకాదు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, వాణిజ్య సముదాయాలు, కిరాణా స్టోర్లు, ఆలయాలు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయంపై వివరించనున్నారు. ఇంకా ఫ్లెక్సీల ఏర్పాటు, కరపత్రాల పంపిణీతో పాటు సినిమా హాళ్లు, లోకల్ టీవీలు, బిగ్ స్క్రీన్లపై ఆడియో, వీడియోలను ప్రదర్శించనున్నారు. ఇందుకు ఆర్టీసీ ఉద్యోగులు కూడా విధిగా సహకరించాలని కోరారు. దీనిపై ప్రముఖులను, స్థానిక అధికారులను ఆహ్వానించి డిపోల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు.

### కార్గో సేవలపై విశ్వసనీయత



ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల్లో ఎంతో విశ్వసనీయత ఉంది. ఆర్టీసీ ద్వారా బుక్ చేసిన సరకులు, పార్సిళ్లు, కొరియర్లను ఇతర సంస్థలకు ధీటుగా రాష్ట్రంలో 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నాం. ప్రజాదరణ పొందిన ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను విస్తృతం చేస్తున్నాం. దీని వల్ల ప్రజలకు మరింతగా చేరువవుతాం. డోర్ డెలివరీ ప్రచారం తర్వాత పికప్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెస్తాం. ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలి.

– బలిజి అప్పలనాయుడు, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ కమర్షియల్ మేనేజర్

# పాలవ్యాను ఢీకొని వ్యక్తి దుర్మరణం


సింహాచలం (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: పాలవ్యాను ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతగాజువాక పల్లా వారి వీధి నుంచి చట్టివానిపాలెంకు పల్లా సింహాచలం (రాజు) (43), అతని స్నేహితుడు వారణాసి జనార్దన్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సోమవారం రాత్రి 9.30 నుంచి 10 గంటల మధ్య ప్రాంతంలో పంతులుగారి మేడ వద్దకు వచ్చే సరికి వీరి వెనుక వస్తున్న హెరిటేజ్ పాల వ్యాను బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న జనార్దన్ ఎడమ పక్కన ఉన్న డివైడర్‌పై పడిపోగా, వెనుక కూర్చున్న పల్లా సింహాచలం కుడి వైపు రోడ్డుపై పడిపోయాడు. పాల వ్యాను వెనుక చక్రాలు రాజు పొట్టపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. జనార్దన్ రెండు కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాజువాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన పాలవ్యాను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, వ్యానును స్టేషన్‌కు తరలించారు. మృతుడు పల్లా సింహాచలం ప్రైవేట్ పనులు చేసుకుంటుంటాడని, భార్య, కుమార్తె ఉన్నారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుడు జనార్దన్ పాతగాజువాకలో నూడిల్స్ షాపు నిర్వహిస్తుంటాడని తెలిపారు.

# వ్యాన్ ఢీకొని వాచ్‌మన్ మృతి


రమణ మృతదేహం

గోపాలపట్నం: మర్రిపాలెం కుంచుమాంబ ఆలయం వద్ద రోడ్డు దాటుతున్న పాదచారుడ్ని వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఏడీ నుంచి మర్రిపాలెం వైపు వెళుతున్న వ్యాన్ రోడ్డుదాటుతున్న వి.రమణ (50) ఢీకొట్టడంతో మృతి చెందాడు.

మృతుడు104 ఏరియాలో లయా రెసిడెన్సిలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తన తండ్రి కుంచుమాంబ ఆలయం వద్ద పాల ప్యాకెట్లు విక్రయిస్తుంటాడు. తండ్రిని ఇంటికి తీసుకువెళ్లేందుకు నడుచుకుని వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మృతుడు కొడుకు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# వివాహిత హత్య కేసులో వ్యక్తి అరెస్ట్, రిమాండ్


ఉమామహేశ్వరరావు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): వివాహితను హత్య చేసిన పిన్నింటి ఉమామహేశ్వరరావును ద్వారకా పోలీసులు మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు. ద్వారకానగర్ 3వ లేన్, సత్య శ్రీదేవి ఎన్‌క్లేవ్‌లో ఆరిలోవకు చెందిన సువ్వాడ సుజిత(36) అలియాస్ సుజాత టెలీకాలర్‌గా పనిచేస్తోంది. ఈమె భర్తకు దూరంగా, తన ఇద్దరు పిల్లలతో ఆరిలోవ ప్రాంతం క్రాంతినగర్‌లో నివసిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరరావు ఈమెను గత కొన్నాళ్లుగా వెంటపడి, వేదిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో సుజిత పనిచేస్తున్న కార్యాలయానికి వెళ్లాడు. ఆమెతో మాట్లాడుతూ, ఫోన్‌ను లాక్కుని కిందికి వచ్చేశాడు. దీంతో తన ఫోన్ కోసం సుజిత కిందికి దిగింది. అదే సమయంలో ఉమామహేశ్వరరావు తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె కంఠంలో బలంగా పొడిచి, తన కంఠం కూడా కోసుకున్నాడు. సుజిత అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడ్డ ఉమామహేశ్వరరావును పోలీసులు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం డిశ్చార్జ్ అయిన అతడిపై సీఐ ధర్మేంద్ర కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# సోలో సైక్లింగ్‌లో కృత్తికా చతుర్వేది ఘనత



సైక్లింగ్‌లో ఘనత సాధించిన కృత్తికా చతుర్వేది

తాటిచెట్లపాలెం : సోలో సైక్లింగ్‌లో భారత నావికాదళానికి చెందిన అధికారి సతీమణి కృత్తికా చతుర్వేది ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక సైక్లింగ్ సీజన్‌లో రెండు సెట్స్‌ను పూర్తి చేసిన మొట్టమొదటి మహిళగా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఈమె 200, 300, 400, 600 కిలోమీటర్లను ఒక సైక్లింగ్ సీజన్‌లో పూర్తిచేశారు. అడక్స్ క్లబ్ పర్షియన్, ఫ్రాన్స్‌చే ధ్రువీకరించిన బ్రెవట్ డెస్ రాన్ డోన్యూర్స్ ఆధ్వర్యంలో ఈమె ఈ ఘనతను సాధించారు.

# సం'క్షేమ' హాస్టల్స్

- మారుతున్న వసతి గృహాల రూపురేఖలు
- జిల్లా పరిధిలో హంగులద్దుకుంటున్న హాస్టల్స్
- తొలివిడతలో రూ.2.47 కోట్లతో 6 హాస్టల్స్ ఆధునికీకరణ పూర్తి
- రూ.2.54 కోట్లతో చురుగ్గా సాగుతున్న 7 హాస్టల్స్ అభివృద్ధి పనులు


సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహం


హాస్టల్ కిచెన్


హాస్టల్ ఫ్లోర్

సాక్షి, విశాఖపట్నం : నడవడానికి తుప్పలు.. బురద గుంటల దారి.. పెచ్చులూడిపోయిన పైకప్పులు.. గుంతలమయంగా ఫ్లోర్లు.. తలుపులు లేని టాయిలెట్స్.. ఏ క్షణంలో ఏ పెచ్చు ఊడి మీద పడిపోతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు వసతి గృహాల్లో కాలం వెళ్లదీసేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది.. పాలన మారింది.. హాస్టల్స్ అవస్థలూ మారిపోయాయి. సంక్షామ వసతి గృహాలుగా కనిపించేవన్నీ.. ఇప్పుడు సంక్షేమ వసతి గృహాలుగా కొత్త రూపు సంతరించుకున్నాయి. జిల్లాలోని హాస్టల్స్ అభివృద్ధి కోసం కలెక్టర్ అమలు చేస్తున్న ప్రత్యేక ప్రణాళికలు సత్ఫలితాలిస్తున్నాయి. తొలి విడతలో రూ.2.47 కోట్లతో 6 హాస్టల్స్‌ను ఆధునికీకరణ చేశారు. మలి దశలో రూ.2.54 కోట్లతో 7 హాస్టల్స్ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాలు సకల వసతుల సమాహారంగా మారుతున్నాయి. టీడీపీ పాలనలో కనీస సౌకర్యాలు కరువవ్వడంతో.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన వారు కూడా హాస్టల్స్‌లో తమ పిల్లల్ని చేర్పించాలంటే భయాందోళనలకు గురయ్యేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం.. ప్రతి వసతి గృహ విద్యార్థికి పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. నాడు–నేడులో భాగంగా హాస్టల్స్ అభివృద్ధి చేస్తున్నారు. మరోవైపు కలెక్టర్ మల్లికార్జున సైతం వసతి గృహ విద్యార్థులు ఎలాంటి కష్టం కలగకుండా చదువు సాగించాలనే ఆలోచనతో హాస్టల్స్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 13 హాస్టల్స్ రూపురేఖలు మార్చే పనిలో నిమగ్నమయ్యారు.

**కలెక్టర్ ప్రత్యేక చొరవ**

హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులపై కలెక్టర్ మల్లికార్జున ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వయంగా హాస్టళ్లను సందర్శిస్తున్నారు. గతంలో హాస్టల్స్‌ను పరిశీలించిన సమయంలో వాటి దుస్థితిని చూసి చలించిన కలెక్టర్ వెంటనే భవనాలు, ఇతర మౌలిక సౌకర్యాల ఆధునికీకరణ చేపట్టాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా.. ప్రభుత్వానికి వివిధ పరిశ్రమలు అందించే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో హాస్టల్స్ రూపురేఖలు మార్చేశారు. జిల్లా పరిధిలో ఉన్న ప్రతి హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. అక్కడ పిల్లలతో మాట్లాడి ఆ వసతి గృహంలో ఉన్న సమస్యలేమిటనే అంశంపై ఆరా తీసేవారు. ప్రధానమైన సమస్యలను ముందుగా పరిష్కరించేందుకు అధికారులతో కలిసి ప్రత్యేక నివేదికను సిద్ధం చేసి ఆ దిశగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

**ఎలా అభివృద్ధి చేశారంటే...**

ఎక్కువ సమస్యలున్న హాస్టళ్లను తొలి విడతలో ఎంపిక చేశారు. వసతి గృహ భవనాలు ప్రథమ ప్రాధాన్యతగా, మరుగుదొడ్లు రెండో ప్రాధాన్యతగా, భోజనశాల, మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలు పాత్‌వేలు, లైబ్రరీ, ఉద్యానవనాలు, సోలార్ లైటింగ్ ఏర్పాటు తదితర అంశాలపై దృష్టిసారించి. వాటి పనులు చేపట్టారు. కూలిపోయే స్థితిలో ఉన్న శ్లాబులను పడగొట్టి కొత్త శ్లాబులను నిర్మించారు. గదులకు కొత్త టైల్స్ ఏర్పాటు చేశారు. ప్రతి హాస్టల్‌లో ఉన్న మొత్తం గదులకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. అన్ని గదులకు ఫ్యాన్లు అమర్చారు. వాష్ బేసిన్లు నిర్మించారు.

**ఆహ్లాదకరంగా ఉండేలా**

ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు చదువులో రాణించగలరు. పలు మార్లు తనిఖీలు నిర్వహించిన సమయంలో కొన్ని హాస్టల్స్‌లో వర్షం పడినప్పుడు నీటితో ఆ గదులు నిండిపోవడం కలిచి వేసింది. అందుకే వాటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశాం. విడతల వారీగా వసతి గృహాలు అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికంగా ఉన్న సంస్థల సహకారంతో ఇప్పటికే 6 హాస్టల్స్ రూపురేఖలు మార్చేశాం. ప్రస్తుతం మరో 7 హాస్టల్ పనులకు శ్రీకారం చుట్టాం. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు హాస్టల్స్‌లో లైబ్రరీలు, గార్డెన్ ఏర్పాటు చేశాం. మిగిలిన విద్యాలయాలపైనా దృష్టిసారించాం.

– డా.ఏ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

**పూర్తయిన హాస్టల్స్ వివరాలివీ...**

| వసతి గృహం | విద్యార్థుల సంఖ్య | ఖర్చు (రూ.లక్షల్లో) |
|---|---|---|
| ఎస్‌డబ్ల్యూ ప్రభుత్వ బాలికల వసతి గృహం, నడుపూరు | 80 | 70 |
| ఎస్‌డబ్ల్యూ ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్, పెదగంట్యాడ | 80 | 23 |
| ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ హాస్టల్ కాంప్లెక్స్, భీమిలి | 200 | 55.01 |
| బీసీ కాలేజ్ గరల్స్ హాస్టల్, భీమిలి | 100 | 41.62 |
| ఎస్‌డబ్ల్యూ ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్, పరదేశిపాలెం | 150 | 22.67 |
| బీసీ బాలికల వసతి గృహం, భీమిలి-2 | 100 | 34.79 |
| మొత్తం | 710 | 247.09 |

**పనులు పురోగతిలో ఉన్న వసతి గృహాలు**

| వసతి గృహం | విద్యార్థుల సంఖ్య | ఖర్చు (రూ.లక్షల్లో) |
|---|---|---|
| ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, ఇసుకతోట | 100 | 29 |
| ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, ఆనందపురం | 120 | 30 |
| ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, పద్మనాభం | 100 | 30 |
| ఎస్‌డబ్ల్యూ బాలికల కళాశాల వసతి గృహం, భీమిలి | 100 | 35 |
| ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, ఇస్లాంపేట | 140 | 50 |
| ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహం, పెందుర్తి | 120 | 30 |
| ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, చేపలుప్పాడ | 80 | 50 |
| మొత్తం | 760 | 254.00 |

# కంబాలకొండ ట్రెక్కింగ్.. చెప్పలేనంత థ్రిల్లింగ్



మూడు కిలోమీటర్ల ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారం

ఆరిలోవ: నగరంలో పర్యాటక ప్రాంతాల్లో కంబాకొండ ప్రత్యేకమైనది. వినోదంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణలో ట్రెక్కింగ్ సదుపాయం కూడా ఉంది. అటవీ శాఖ అధికారులు సుమారు 100 ఎకరాల్లో ఎకో టూరిజం పార్కు ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలో శంభువానిపాలానికి చెందిన వీఎస్ఎస్ సభ్యులు దీన్ని నిర్వహిస్తున్నారు. సహజసిద్ధమైన అడవుల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లే వారికి మంచి అనుభూతి కలుగుతుంది. ఎత్తుపల్లాలు, కొండల మధ్య లోయలు దాటుకుంటూ వెళితే మధ్యమధ్యలో వందలాది ఔషధ మొక్కలు కనిపిస్తాయి. వివిధ జాతులకు చెందిన రంగు రంగు పక్షులు, చెంగుచెంగుమని గెంతులేసే చుక్కల జింకలు, చెట్ల కొమ్మలు లాంటి కొమ్ములతో కణుజులు, ముళ్ల పందులు, నెమళ్లు తదితర వన్యప్రాణులు తారసపడతాయి. నగరం మధ్యలో ఎక్కడా ఇలాంటి వాతావరణం లేదు. నగరాన్ని ఆనుకొని ఉన్న డెయిరీఫారం, జూ పార్కు, ఎండాడ, మధురవాడ, శొంఠ్యాం, అడవివరం, ఆరిలోవ ప్రాంతాల మధ్యలో కంబాలకొండ ఉన్నాయి.

**2, 3,7 కిలోమీటర్లు ట్రెక్కింగ్**

అధికారులు 2,3,7 కిలోమీటర్ల చొప్పున ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ఒకరు నుంచి ఎంతమందైనా గుంపుగా వెళ్లవచ్చు. ముళ్ల తుప్పలు, కొండల మధ్య లోయలు, ఎత్తుపల్లాలు, రాళ్ల గుట్టలు దాటుకొంటూ ప్రయాణించాలి. రూ.200 (ఒక్కొక్కరికి) టికెట్ తీసుకుని ట్రెక్కింగ్‌కు వెళ్లాలి. వారితో పాటు కంబాలకొండలో పనిచేస్తున్న సిబ్బందిలో ఒకరు గైడ్‌గా వెళతారు. మూడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ ట్రెక్ కంబాలకొండ క్యాంటిన్ నుంచి ప్రారంభమై బోటింగ్ నిర్వహించే చెరువు వెనుక భాగంలో ముగుస్తుంది. రెండు, ఏడు కిలోమీటర్ల ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు క్యాంటిన్ ఎదురు మార్గం ద్వారా ప్రవేశంచాలి. కొంత దూరం వెళ్లిన తర్వాత రెండు కిలోమీటర్లు దారి బోటింగ్ కొలను వైపు తిరిగిపోతుంది. ఏడు కిలోమీటర్లు దారి మాత్రం మూడు కొండలు మధ్య నుంచి జాతీయ రహదారిని ఆనుకొని జంతు పునరావాస కేంద్రం పక్కన ముగుస్తుంది. వేసవి కాలంలో రోజూ ఇక్కడ ట్రెక్కింగ్ వెళుతుంటారు. దీంతో పాటు కార్తీక మాసంలో కూడా యువకులు గుంపులుగా ట్రెక్కింగ్‌కు వెళుతుంటారని కంబాలకొండ నిర్వాహకులు చెబుతున్నారు.

# ఒక్కొక్కరికి రూ. 1చొప్పున ఫోన్‌పే

- సెయిల్ కార్మికుల వినూత్న నిరసన

ఉక్కునగరం: బోనస్ అంశంలో ఎన్‌జేసీఎస్ కేంద్ర నాయకుల తీరుపై సెయిల్ కార్మికులు వినూత్న నిరసన ద్వారా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. దసరా ముందు బోనస్ అంశంపై జరిగిన ఎన్‌జేసీఎస్ సమావేశంలో కొత్త ఫార్ములా ప్రకారం రూ.22,579 మాత్రమే ఇస్తామని యాజమాన్యం ప్రతిపాదించింది. దీనికి కొంత వెసులుబాటు కల్పిస్తూ రూ.23 వేలు మించి ఇచ్చేది లేదని భీష్మించుకుని కూర్చుంది. కార్మిక నాయకుల అంగీకారం లేకుండానే ఏకపక్షంగా కార్మికుల అక్కౌంట్లకు ఈనెల 20న రూ. 23 వేలు చొప్పున వేసింది. గత ఏడాది వచ్చిన రూ. 40,500 కంటే ఎక్కువ బోనస్ వస్తుందని ఆశించిన కార్మికులకు ఈ బోనస్ తీరని ఆగ్రహాన్ని కల్పించింది. కొత్త ఫార్ములాకు ఎన్‌జేసీఎస్‌లోని మూడు సంఘాలు అంగీకరిస్తూ సంతకాలు చేయడాన్ని కార్మికులు గుర్తించారు. దీంతో మీరు కూడా దుర్గాపూజ బాగా జరుపుకోవాలంటూ కేంద్ర నాయకులకు ఒక్కొక్కరికి రూ.1 చొప్పున ఫోన్‌పే చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ నాయకులకు ఈ విధంగా ఫోన్‌పే పంపినట్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కార్మికుల ఆగ్రహం చూసిన నాయకులు బేజారెత్తి సెయిల్ యాజమాన్యంకు లేఖలు రాయడం ద్వారా దిద్దుబాటు కార్యక్రమాలు ప్రారంభించినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో బోనస్ అంశంపై యూనియన్ నేతలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

# స్టాఫ్ నర్సుల ప్రొవిజినల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి విడుదల చేశారు. సోమవారం సాయంత్రం జాబితాను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపంగా వారు http@//cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. జాబితాపై అభ్యంతరాలుంటే మూడు రోజుల్లోగా తెలియజేయాలన్నారు. త్వరలో ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేస్తామన్నారు.

**పోస్టుల వివరాలు**

మొత్తం ఆరు జిల్లాల్లో 86 పోస్టులకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం,విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తం 10,659 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. 86 పోస్టులకు గానూ మొత్తం 7,765 పోటీ పడుతున్నారు. విజయనగరం జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో 80 మంది స్టాఫ్ నర్సులు, వైద్య విధాన పరిషత్ పరిధిలో ఆరు పోస్టులు భర్తీ చేయనున్నారు. స్టాఫ్ నర్సుల పోస్టులను మెరిట్, రోస్టర్ విధానంలో భర్తీ చేయనున్నారు.

# షాలిమార్ - వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం : మంగళవారం రాత్రి 11.20గంటలకు షాలిమార్‌లో బయల్దేరాల్సిన షాలిమార్–వాస్కోడిగమా (18047) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా బుధవారం తెల్లవారు 1.20గంటలకు బయల్దేరిందని, అంతే ఆలస్యంగా ఈ రైలు వివిధ స్టేషన్లకు చేరుకుంటుందని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

# డిసెంబర్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో



ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రతినిధులు, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: క్రెడాయ్ 9వ ప్రాపర్టీ ఎక్స్‌పో విశాఖలో డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలస్ వేదికగా ఎక్స్‌పో నిర్వహించనున్నట్టు క్రెడాయ్ సంస్థ చైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు (సాయి), అధ్యక్షుడు వి.ధర్మేందర్, గౌరవ కార్యదర్శి, ఎక్స్‌పో కన్వీనర్ వి.శ్రీను తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎనిమిదేళ్లుగా క్రమం తప్పకుండా ప్రాపర్టీ ఎక్స్‌పోలు నిర్వహిస్తున్నామన్నారుర. గృహాల కొనుగోలుదారులు, విక్రయదారులకు ఎక్స్‌పో వేదికగా నిలవనుందని, అక్కడికక్కడే లావాదేవీలు జరుగుతుండడం వల్ల క్రెడాయ్ ఎక్స్‌పోకు మంచి ప్రజాదరణ ఉందన్నారు. మరీ ముఖ్యంగా నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలోని వాటాదారులందర్నీ ఒకే ప్లాట్ ఫాంపైకి తేవడమే ఎక్స్‌పో ముఖ్యోద్దేశమన్నారు. అన్ని రకాల ప్లాట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు తదితర వాటిని ప్రఖ్యాత బిల్డర్లతో పాటు బిల్డింగ్ మెటీరియల్, నిర్మాణ సామగ్రిని తయారు చేసే ప్రఖ్యాత కంపెనీలు కూడా ఈ ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయని తెలిపారు. అంతే గాక వివిధ ప్రాజెక్ట్స్‌లో ఉపయోగించే మెటీరియల్, నాణ్యతపై కొనుగోలుదారులకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ముందుగా ఆమోదించిన గృహ రుణాలు ప్రాసెస్ చేయడం కూడా అదే సమయంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆన్ ది స్పాట్ బుకింగ్స్ కోసం ప్రోత్సాహకాలు, ప్రత్యేక డీల్‌లు ఉంటాయన్నారు. 80కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారని, అసాధారణమైన ధరల్లో, సామాన్యులకు కూడా ఎంతో ఉపయోగకరంగా నిలవనుందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ఇటువంటి ఎక్స్‌పోలు ఎంతో అవసరమన్నారు. విశాఖలో రాజధాని వస్తే రియల్‌ఎస్టేట్ రంగం బాగా పుంజుకుంటుందని చెప్పారు.కార్యక్రమంలో క్రెడాయ్ విశాఖ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.8 లక్షలు దాటిన జూ ఆదాయం


తెల్ల పులి ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కుకి దసరా తాకిడి పెరిగింది. ఇంత వరకు బోసిపోయిన జూ పార్కు పాఠశాలలు, కార్యాలయాలకు దసరా సెలవులు కావడంతో నాలుగు రోజులుగా సందర్శకులతో కిటకిటలాడుతోంది. మంగళవారం విజయదశమి సందర్భంగా మరింత తాకిడి పెరిగింది. దీంతో జూకి రూ.లక్షల్లో ఆదాయం చేకూరింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ పార్కును 8,253 మంది సందర్శించారు. వారి ద్వారా రూ.8,17,377లు ఆదాయం లభించినట్లు జూ అధికారులు తెలిపారు. గత ఏడాది కార్తీక మాసం ఆదివారాల తర్వాత ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం లభించడం పట్ల అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. జూని సందర్శించిన పిల్లలు, పెద్దలు ఇక్కడి వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. పక్షులు, జంతువులు సందర్శకులను అలరించాయి.